సాక్షి నల్లగొండ

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



దొంగల ముఠా అరెస్ట్

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను మేళ్లచెరువు పోలీసులు పట్టుకున్నారు. - IIలో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	589.50 అడుగులు
ఇన్‌ఫ్లో	64,755 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	16,096 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	29,719 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	9,967 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	6,173 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	2,400
వరద కాల్వకు	400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	643.80 అడుగులు
ఇన్‌ఫ్లో	911క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	701 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	నిల్
కుడికాల్వకు	నిల్

న్యూస్‌రీల్

28న మెగా జాబ్‌మేళా

నల్లగొండ: నల్లగొండలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 28 మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్న ఈ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

నల్లగొండ టౌన్: 2024–25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని పారా మెడికల్ ప్రైవేట్ కళాశాలల్లో డీఎంపీహెచ్‌ఏ(మేల్), డీఎంఎల్‌టీ, డీఏటీ, డీఏఎన్‌ఎస్, డీఎంఐటీ, డీఆర్‌జీఏ, డీఎైఎం, డీఈసీజీ, డీడీఆర్‌ఏ, డయాలసిస్, డీఏఎం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

దోపిడీలేని సమాజమే కమ్యూనిస్టుల లక్ష్యం



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్: దోపిడీలేని సమ సమాజ స్థాపనే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు స్వాతంత్య్ర పోరాటంలోనూ సీపీఐ అగ్రభాగాన నిలిచిందని గుర్తు చేశారు. పార్టీ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, ఆదిరెడ్డి, నరసింహారెడ్డి, రత్నాకర్‌రావు, నెల్లికంటి సత్యం, శ్రవణ్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

నల్లగొండ రూరల్: కార్తీకమాసం సందర్భంగా పంచారామ క్షేత్రాల దర్శనార్థం ఉమ్మడి జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్‌ఎం రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలకు నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో (ప్రతి ఆదివారం) డిపోల నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకన్న యాదవ్

భానుపురి (సూర్యాపేట): తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా నియామకమైన డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ శనివారం హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణ భవన్‌లో తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పాల్గొన్నారు.

శంషాబాద్ టు విశాఖపట్నం.. వయా సూర్యాపేట

హైస్పీడ్ కారిడార్!

చివరి దశలో ప్రాథమిక సర్వే

- డోర్నకల్ టు గద్వాల లైన్ కూడా సూర్యాపేట మీదుగానే..
- నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని పలు ప్రాంతాలకు కనెక్టివిటీ
- డీపీఆర్ పూర్తయి ఆమోదం లభించిన తర్వాత ఫైనల్ లొకేషన్ సర్వే
- ఏళ్ల తరబడి రైల్వే కనెక్టివిటీ కోసం 'పేట' వాసుల ఎదురుచూపు
- గతంలో ఆచరణకు నోచుకోని బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సూర్యాపేట జిల్లా కేంద్రానికి రైల్వే కనెక్టివిటీ కోసం జిల్లా వాసులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. ఆ కల ఇప్పటికైనా నెరవేరుతుందా? అన్నది త్వరలోనే తేలనుంది. గతంలో పలుమార్లు కొత్త రైల్వే లైన్లను ప్రతిపాదించినా అవి కాగితాలకే పరిమితం కాగా, తాజాగా సూర్యాపేట మీదుగా శంషాబాద్ నుంచి విశాఖపట్టణం హైస్పీడ్ రైల్వే కారిడార్‌కు చేపట్టిన ప్రిలిమినరీ ఇంజనీరింగ్ ట్రాఫిక్ (పెట్) సర్వే చివరి దశకు చేరింది. ఎస్‌ఎం కన్సల్టెన్సీ చేస్తున్న ఆ సర్వే నివేదిక నవంబరు నెలలో రైల్వే బోర్డుకు చేరనుంది. ఇది ఆచరణలోకి వస్తే గంటకు 220 కిలోమీటర్ల వేగంతో నడిచే హైస్పీడ్ రైల్ శంషాబాద్ నుంచి సూర్యాపేట మీదుగా విశాఖపట్టణానికి దాదాపు 4 గంటల్లో చేరనుంది.

రెండు రూట్లలో సర్వే..

శంషాబాద్ నుంచి విశాఖపట్టణానికి హైస్పీడ్ రైల్వే కారిడార్ కోసం పెట్ సర్వేను చేపట్టిన సంస్థ, విశాఖపట్టణం నుంచి కర్నూలుకు సూర్యాపేట, నల్లగొండ మీదుగా హైస్పీడ్ రైల్వే కారిడార్ ఏర్పాటుకు మరొక సర్వేను చేపట్టింది. అందులో ఒక లైన్ శంషాబాద్ నుంచి గట్టుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, నకిరేకల్, సూర్యాపేట జిలా కేంద్రం, కోదాడ వంటి ప్రాంతాలను కలుపుతూ జగ్గయ్యపేట, విజయవాడ మీదుగా విశాఖపట్టణం చేరనుంది. మరొక లైన్ విశాఖపట్టణం నుంచి విజయవాడ, జగ్గయ్యపేట, సూర్యాపేట, నల్లగొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల మీదుగా కర్నూలుకు చేరేలా రైల్వే లైన్‌కు సర్వే చేపట్టింది. ఇది ఆచరణలోకి వస్తే ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు రైల్వే కనెక్టివిటీ లేని అనేక ప్రాంతాలకు రైలు సదుపాయం లభించనుంది.

గతంలో సర్వే చేపట్టినా..

ఇప్పటికే డోర్నకల్ నుంచి గద్వాల వరకు కొత్త రైల్వే లైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వేకు (ఎఫ్‌ఎల్‌ఎస్) రైల్వే బోర్డు గతంలో ఆమోదం తెలిపింది. సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి మీదుగా 296 కిలోమీటర్ల పొడవున డోర్నకల్– గద్వాల మధ్య కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కోసం ఎఫ్‌ఎల్‌ఎస్ చేపట్టేందుకు రూ.7.40 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించింది. అయితే దానికి సంబంధించిన పనులు ఏ దశలో ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

డీపీఆర్ ఓకే చెబితేనే ముందుకు..

ప్రస్తుతం సూర్యాపేట మీదుగా శంషాబాద్ నుంచి విశాఖపట్టణానికి, విశాఖపట్టణం నుంచి కర్నూలుకు ఏర్పాటు చేయతలపెట్టిన హైస్పీడ్ రైల్వే కారిడార్ పెట్ సర్వే తుది దశకు చేరిన నేపథ్యంలో ఆ నివేదిక సర్వే సంస్థ నవంబరులో రైల్వే బోర్డుకు సమర్పించనున్నట్లు తెలిసింది. ఇది పూర్తిగా ప్రాథమిక స్థాయి సర్వే మాత్రమే. ఆ తరువాత దశ దాటితే హైస్పీడ్ రైల్వే కారిడార్ పనులు ముందుకు సాగనున్నాయి. ఇందుకు దాదాపు రూ.20 వేల కోట్ల భారీ బడ్జెట్ అవసరం కానున్నట్లు అంచనా వేశారు. రైల్వే బోర్డుకు పెట్ సర్వే నివేదిక అందిన తరువాత బోర్డు పరిశీలించి ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. బోర్డు పరిశీలనలోనే ఏళ్ల తరబడి మగ్గిపోతున్న ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో రైల్వే బోర్డు నుంచి జాతీయ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు పంపించిన బుల్లెట్ రైల్ ప్రతిపాదన కూడా ఒకటి. ఈ నేపథ్యంలో ఇప్పుడు హైస్పీడ్ రైల్వే కారిడార్‌కు సంబంధించి రైల్వే బోర్డు పెట్ సర్వే తరువాత డీటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు రూపొందించడానికి మరో కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. అది పూర్తయ్యాక ఫైనల్ లొకేషన్ సర్వే చేపట్టాల్సి ఉంటుంది. అవన్నీ పూర్తయి, వాటికి బోర్డు ఆమోదం లభించాక, బడ్జెట్ కేటాయింపుల అనంతరం కొత్త రైల్వే కారిడార్ పనుల ప్రక్రియ పట్టాలెక్కనుంది.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ : రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు అన్ని సౌకర్యాలు కల్పించాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గతనెల 24న నల్లగొండలోని బోయవాడలో ఉన్న ప్రభుత్వ పట్టణ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాను ఇచ్చిన హామీ ఎంతవరకు అమలు అయ్యిందో తెలుసుకునేందుకు శనివారం ఆయన మధ్యాహ్న భోజనం సమయంలో అదే పాఠశాలను తనిఖీ చేశారు. అయితే గత నెలకు, ఈ నెలకు పాఠశాల రూపురేఖలు మారిపోవడాన్ని గమనించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం గురించి ఆరా తీయగా, గతంలో కంటే ఇప్పుడు భోజనం బాగా పెడుతున్నారని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. పాఠశాలలోని అన్ని తరగతి గదులు, పైఅంతస్తులోని హాలు మరమ్మతులు చేయించడమే కాకుండా, వైర్లు సరిచేయించి అన్ని గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు పెట్టి, రంగులు వేయించడం, టాయిలెట్లు మరమ్మతులు చేయించి వంటగదిని శుభ్రంగా ఉంచడాన్ని గమనించిన కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. తాము అడిగిన వెంటనే అన్ని సౌకర్యాలు కల్పించి బాగా చదువుకునేందుకు అవకాశాలు కల్పించిన కలెక్టర్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.



టాయిలెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

దుకాణదారుడికి నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..



దుకాణానికి మున్సిపల్ అధికారులు అంటించిన నోటీసు

మిర్యాలగూడ : పట్టణం నడిబొడ్డున అనుమతి లేని ఫుట్‌వేర్ షాపును 15 రోజుల్లో తొలగించాలని.. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేశారు. ఈ దుకాణం ఏర్పాటు చేసిన భూమిపై.. ఈనెల 22న 'సాక్షి'లో 'రూ.20కోట్ల భూ కుంభకోణం'అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని సర్వే నంబర్ 992లో ఏసీసీ, ఐరన్ రేకులతో అనుమతి లేకుండా చెప్పుల దుకాణానికి అద్దెకు ఇచ్చిన భూ భాగస్వాములకు, దుకాణాదారులకు ఈనెల 19న నోటీసులు అందజేశారు. ఏడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని కోరారు. సరైన సమాధానం రాలేదని, అందుకే తుది నోటీసులు ఇచ్చామని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. నోటీసు అందిన 15 రోజుల్లో అనుమతి లేని నిర్మాణాన్ని తొలగించకుంటే సెక్షన్ 178 మున్సిపల్ యాక్ట్ 2019 ప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నోటీసులను భూమి భాగస్వాములు మున్సిపల్ కౌన్సిలర్ ఉదయ్‌భాస్కర్, సైదిరెడ్డికి అందజేసినట్లు తెలిపారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్
- పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నల్లగొండలో బైక్‌ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పోలీస్ సిబ్బంది

నల్లగొండ క్రైం: విధినిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో జెండా ఊపి బైక్‌ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా ఎందరో పోలీసులు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. పోలీసులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. అమరులను స్మరించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీలు రమేష్, శ్రీనివాసులు, శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో అవకాశాల కోసం ఎదురుచూస్తూ కాలం గడిపేవారు కొందరైతే. అవకాశాలను సృష్టించుకుని జీవితంలో పైకి ఎదిగేవారు మరికొందరు. రెండవ కోవకు చెందిన వారే కాటేపల్లి ఐశ్వర్య. నల్లగొండ పట్టణంలో సామాన్య కుటుంబంలో పుట్టి పెరిగిన ఐశ్వర్య 17 ఏళ్ల వయస్సులోనే ఫ్యాషన్ రంగంలో దూసుకుపోతోంది. లక్షల మంది పాల్గొనే ఈ పోటీల్లో ఒకసారి ఫైనల్‌కు పోవడమే గగనమైన స్థితిలో రెండుసార్లు ఫైనలిస్ట్‌గా నిలిచి అందరి మన్ననలు పొందుతోంది. - సాక్షి, నల్లగొండ డెస్క్



ఫ్యాషన్ వేదికపై మన ఐశ్వర్య

జాతీయ స్థాయిలో దూసుకుపోతున్న నల్లగొండ బిడ్డ

- 'అలీ క్లబ్ మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా–2024' పోటీల్లో ఫైనల్‌కు ఎంపిక
- రెండు ఓటీటీ సినిమాల్లోనూ నటించిన కాటేపల్లి ఐశ్వర్య
- అవి విడుదలైతే మరిన్ని అవకాశాలు
- అన్ని రంగాల్లో ప్రతిభ ఉంటేనే ఉన్నత స్థానంలోకి వెళ్తామంటున్న ఐశ్వర్య



దేశవ్యాప్తంగా 13 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువతీయువకుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు 'అలీ క్లబ్ మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా' పెద్ద నగరాల్లో తొలిపోటీలు నిర్వహిస్తుంది. అందులో ప్రతిభ చూపిన వారిని ఢిల్లీలో జరిగే ఫైనల్ పోటీలకు పంపుతుంది. 2021లో జరిగిన పోటీల్లో ఐశ్వర్య ఫైనల్ పోటీలకు ఎంపికైంది. కానీ కరోనా సమయంలో వారు ఇచ్చిన టాస్క్ చేసే సమయం లేక ఫైనల్‌లో పాల్గొన లేదు. ఆగస్టు 2024లో నిర్వహించిన పోటీల్లో సులువుగా ప్రిలిమినరీ పోటీలను దాటుకుని ఫైనల్‌కు చేరుకుంది. మిస్ ఇండియా పోటీల్లో అందం ఒక్కటే ప్రధాన ప్రాత పోషిస్తుందని, మిస్ టీన్ పోటీల్లో మాత్రం అందం భాగమే కానీ ప్రధానం కాదని, తెలివితోపాటు సమయస్ఫూర్తి, స్పందించే గుణం ముఖ్యమని ఐశ్వర్య చెబుతోంది. తాను ఈ పోటీల్లో రాణించడానికి తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోపాటు సోదరి సహకారం మరువలేనిదని పేర్కొంటోంది.

త్వరలో వెండితెరపైకి..

ఐశ్వర్య తల్లిదండ్రులది నల్లగొండ. తల్లి ఉమ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, తండ్రి సుధీర్ వ్యాపారవేత్తగా పనిచేస్తున్నారు. వీరి కుటుంబం కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటోంది. ప్రస్తుతం ఇంటర్మీడియట్ ఒకేషనల్‌లో కంప్యూటర్ గ్రాఫిక్స్, డిజిటల్ మార్కెటింగ్ కోర్సు చదువుతున్న ఐశ్వర్య అనుకోకుండా ఫ్యాషన్ రంగంలోకి వచ్చింది. ఇప్పటికే రెండు ఓటీటీ సినిమాల్లోనూ నటించింది. ఒకటి హర్రర్ మూవీ కాగా, మరొకటి లవ్ స్టోరీ. ఈ రెండు సినిమాలు విడుదలైతే తన టాలెంట్‌కు తగట్టు మరిన్ని అవకాశాలు వచ్చే అవకాశం ఉందని ఐశ్వర్య చెబుతోంది. 'మిర్రర్ ఇమాజినేషన్' (అద్దంలో తనను తాను చూసుకుంటూ) పద్ధతిలో నటనకు మెరుగులు దిద్దుకున్నట్లు పేర్కొంటోంది. సినిమా రంగంలో సక్సెస్ రేటు తక్కువగా ఉంటుందని.. అందుకే ఓటీటీ రంగం వైపు దృష్టి సారించినట్లు చెబుతోంది. ఈ రంగంలో రాణించాలంటే కేవలం అందం ఒక్కటే సరిపోదని అన్ని రంగాల్లో ప్రతిభ చూపినప్పుడే ఉన్నత స్థానంలోకి వెళతామని అంటోంది. 6వ తరగతి చదువుతున్న సమయంలోనే పాఠశాలలో చేసిన కొన్ని ప్రదర్శనలు తనకు ఈ రంగంపై మక్కువను పెంచినట్లు చెబుతోంది.



'అలీ క్లబ్ మిస్ టీన్ ఇండియా ఫైనల్ ఎంపిక పోటీలో పాల్గొన్న కాటేపల్లి ఐశ్వర్య



స్కిల్స్‌ను చిన్నతనంలోనే గుర్తించాలి

"పిల్లల్లో ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలి. 6వ తరగతిలో నాలో ఉన్న స్కిల్స్‌ను ఉపాధ్యాయులు గుర్తిస్తే, తల్లిదండ్రులు ప్రోత్సహించారు. వారు ఇచ్చిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకొని ఈ స్థాయికి వచ్చాను. నాకు మెంటర్‌గా పనిచేసి గురువు పడుతున్న కష్టాన్ని చూసి నేను కూడా కసిగా నాలోని నైపుణ్యాలను మెరుగు పర్చుకున్నాను. డిజిటల్ మార్కెటింగ్ చేస్తుండగా వచ్చిన తొలి ఆదాయంతో అమ్మకు చీర కొనిచ్చాను. అది తీసుకున్న సమయంలో అమ్మకళ్లలో కనిపించిన ఆనందాన్ని మరువలేను. నల్లగొండ వంటి చిన్న పట్టణం నుంచి జాతీయస్థాయి వరకు నేను ఎదగడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. తల్లిదండ్రులు కూడా పిల్లలను అది చేయి, ఇది చేయి అనే ఆంక్షలు పెట్టకుండా వారికి నచ్చిన రంగంలో ఎదిగే విధంగా ప్రోత్సహించాలి. పిల్లలు కూడా తల్లిదండ్రుల ఆంకాక్షలను గుర్తుపెట్టుకోవాలి. ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోకుండా లక్ష్యాన్ని సాధించేందుకు కష్టపడాలి. - కాటేపల్లి ఐశ్వర్య

ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలి

- అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో ప్రత్యేక పోలీస్ దళం ఆందోళన
- మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : ఎస్పీ
- సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల అరెస్ట్



బెటాలియన్‌లో కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బెటాలియన్ గేటు వద్ద నిలిపివేసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వాహనం

నల్లగొండ క్రైం: ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని అన్నెపర్తి 12వ బెటాలియన్ ప్రత్యేక పోలీస్ దళం కానిస్టేబుళ్లు శనివారం బెటాలియన్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏక్ పోలీస్ విధానం వల్ల పోలీస్ కుటుంబాలకు దగ్గరగా ఉంటామని.. సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలోనే విధులు నిర్వహిస్తామని ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఇక్కడకు శాంతి భద్రతల పర్యవేక్షణకు వచ్చిన నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబును గోబ్యాక్ అంటూ నినాదాలు చేయడంతో ఆయన వెళ్లిపోయారు. దీంతో విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బెటాలియన్‌కు వెళ్లి పోలీసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏక్ పోలీస్ విధానం అమలు చేయడంతోపాటు పలు సమస్యలపై రాత పూర్వకంగా వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అరెస్ట్

ఆందోళన చేస్తున్న పోలీస్‌లకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని బెటాలియన్ పోలీసులు అనుమతించలేదు. బెటాలియన్ లోపలికి అనుమతించాలని ఆయన పట్టు బట్టడంతో పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తర్వాత మునుగోడు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ పోలీస్ కుటుంబాలను పరామర్శించేందుకు వెళితే తనను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రభుత్వం సమస్యలను పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

చిట్యాల, నార్కట్‌పల్లి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చిట్యాల, నార్కట్‌పల్లి, ఎల్లారెడ్డిగూడెంలో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన.. డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం హరీష్‌తో కలిసి పరిశీలించారు. నిబంధనల మేరకు ధాన్యంలో తేమ శాతం ఉంటే కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలని సూచించారు. సన్నధాన్యం కొనుగోళ్లకు 80 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. డీఎస్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో 325 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 2,400 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ దీపక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లింగస్వామి, పీఏసీఎస్ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్‌ఓ

క్లుప్తంగా

పాలసీదారుడికి బీమా డబ్బులు చెల్లించాలని తీర్పు

రామగిరి(నల్లగొండ): వాహన పాలసీదారుడికి బీమా డబ్బులు చెల్లించాలని నల్లగొండ విని యోగదారుల కమిషన్ తీర్పు వెలువరించింది. నల్లగొండ పట్టణానికి చెందిన అల్తాఫ్ అహ్మద్ 2020లో తన కారుకి ఎసీఐ సంస్థ నుంచి వాహన పాలసీని తీసుకున్నాడు. అదే ఏడాది కారు ప్రమాదానికి గురికాగా రిపేర్ కోసం సదరు బీమా కంపెనీని సంప్రదించాడు. బాధితుడి దరఖాస్తును బీమా కంపెనీ తిరస్కరించింది. 2021లో బాధితుడు నల్లగొండ విని యోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. విచారణలో భాగంగా న్యాయవాది ముశం వంశీకృష్ణ వాదనలతో ఏకీభవించిన వినియోగదారుల కమిషన్ చైర్మన్ మామిడి క్రిష్టోఫర్, సభ్యులు ఎస్. సంధ్యారాణి, కె. వెంకటేశ్వర్లు పాలసీదారుడికి డబ్బులు చెల్లించాలని తీర్పునిచ్చారు. బాధితుడికి 9 శాతం వడ్డీతో రూ. 1,71,950ను 2020 నుంచి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. అదే విధంగా ఫిర్యాదుదారుడికి మానసికంగా వేధించినందుకు రూ.50 వేలు జరిమానా, కోర్టు ఖర్చులకు రూ.10 వేలు ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

చౌటుప్పల్: తాటిచెట్టు పైనుంచి జారి పడి తీవ్రంగా గాయపడిన గీత కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లోని లింగోజిగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు రమనగోని లింగయ్య(59) రోజు వారి మాదిరిగా శుక్రవారం సాయంత్రం గ్రామ పరిధిలోని గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పొలంలో తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన లింగయ్యను కుటుంబ సభ్యులు చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు..

సంస్థాన్ నారాయణపురం: తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన బద్దం జంగయ్య(48) కల్లు తీయడానికి శనివారం గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 8తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలు, నాలుగు ద్విచక్ర వాహనాలు, నాలుగు ట్రాక్టర్ ట్రక్కులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి


స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్: తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను మేళ్లచెర్వు పోలీసులు పట్టుకున్నారు. వివరాలను శనివారం కోదాడ డీఎస్పీ కార్యాలయ ఆవరణలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సైదులు ప్రస్తుతం గరిడేపల్లి మండలం సర్వారంలో నివాసముంటున్నాడు. అతడికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా గురజాలకు చెందిన పిన్నెబోయిన నాగేశ్వరరావు ఇటీవల జాన్ పహాడ్ ఉర్సు వద్ద పరిచయం కాగా.. ఇద్దరు కలిసి దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. వారు మేళ్లచెర్వు మండలం రేవూరిలో తాళం వేసిన ఐదు ఇళ్లలో, పాలకీడు మండలంలోని ఓ ఇంట్లో చోరీ చేసి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా దామరచర్ల, గరిడేపల్లి, హుజూర్‌నగర్, మేళ్లచెర్వు, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో ట్రాక్టర్ ఇంజన్లు, ట్రక్కులు, నాలుగు ద్విచక్ర వాహనాలను దొంగిలించారు. ఈ దొంగలించిన సొత్తును ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెన్నారంలో ఉంటున్న సైదులు భార్య దుర్గ వద్ద, తమ బంధువైన ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలోని నల్లూరి నరసింహారావు వద్ద దాచిపెట్టారు. శనివారం ఉదయం తుమ్మలపల్లి సైదులు, పిన్నెబోయిన నాగేశ్వరరావు వారి వద్ద ఉన్న కొంత బంగారాన్ని విక్రయించేందుకు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు బైక్‌పై వెళ్తూ మేళ్లచెర్వు మండలం రామాపురంలోని బొమ్మల సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి వారు పారిపోయేందుకు యత్నించగా.. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి 8తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి ఆభరణాలు, నాలుగు ద్విచక్ర వాహనాలు, నాలుగు ట్రాక్టర్ ట్రక్కులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, రూరల్ సీఐ రజితారెడ్డి, మేళ్లచెర్వు ఎస్ఐ పరమేష్‌తో పాటు సిబ్బందిని సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు.

పేదింట మెరిసిన విద్యా కుసుమం

- ఎంబీబీఎస్ సీటు సాధించినా ఫీజులు చెల్లించలేని దైన్యం
- ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు


తల్లిదండ్రులతో సానియా

సానియా తండ్రి జహంగీర్
ఫోన్ నంబర్: 9553992652

రామన్నపేట: నిరుపేద ముస్లిం కుటుంబంలో జన్మించిన ఆ అమ్మాయి డాక్టర్ కావాలనే ఆశయంతో కష్టపడి చదివింది. మొదటి ప్రయత్నంలోనే లక్ష్యాన్ని సాధించింది. కానీ ఆమె తల్లిదండ్రులు తమ ఆర్థిక సమస్యలు బిడ్డ చదువుకు ఆటంకం కలిగిస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన ఎండీ జహంగీర్, నస్రీన్ సుల్తానా దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. జహంగీర్ కిరాణా దుకాణం నడిపిస్తూ, నస్రీన్ సుల్తానా టైలరింగ్ చేస్తూ పిల్లలను చదివిస్తున్నారు. వారి పెద్ద కూమార్తె సానియా జనంపల్లిలోని బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసింది. హైదరాబాద్‌లోని గౌలిదొడ్డి సీఓఈ(కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్)లో ఇంటర్ చదివింది. డాక్టర్ కావాలనే పట్టుదలతో ఎలాంటి కోచింగ్ తీసుకోకుండానే నీట్ పరీక్ష రాసి మొదటి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించడంతో పాటు రాష్ట్రస్థాయిలో 4,353 ర్యాంకు పొందింది. ఇటీవల నిర్వహించిన కౌన్సిలింగ్‌లో భద్రాద్రి కొత్తగూడెం మెడికల్ కళాశాలలో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. తల్లిదండ్రులు అతికష్టం మీద ప్రవేశ రుసుము చెల్లించారు. ట్యూషన్, హాస్టల్, లైబ్రరీ తదితర ఫీజులు చెల్లించడానికి, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు కొనుగోలు చేయడానికి డబ్బులు లేక తమ కుమార్తె మెడిసిన్ చదువు ఎక్కడ ఆగిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. సానియా మెడిసిన్ చదువుకు దాతలు ఆర్థికసాయం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

‘రైతు సమ్మేళన’ వేదికను ఢీకొని యువకుడు మృతి


మృతిచెందిన చరణ్


ఉదయం బ్రిడ్జిపై వేస్తున్న సభా వేదిక

శాలిగౌరారం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ నది పునరుజ్జీవం కార్యక్రమానికి మద్దతుగా ఆదివారం శాలిగౌరారం మండలంలోని గురుజాల –మానాయికుంట మధ్యన మూసీ నది బ్రిడ్జిపై మూసీనది పరివాహక రైతుల ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించ తలపెట్టారు. శనివారం రాత్రి ఈ సభ కోసం వేసిన వేదిక ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా కుడకుడ గ్రామ సమీపంలోని జంగాలగూడేనికి చెందిన తూర్పాటి చరణ్(16) తన తల్లిదండ్రులతో కలిసి పత్తి ఏరేందుకు ఇటీవలే శాలిగౌరారం మండలం గురుజాల గ్రామానికి వలస వచ్చాడు. చరణ్ కుటుంబంతో పాటు మరో నాలుగు కుటుంబాలు పత్తి ఏరేందుకు వలస వచ్చి గురుజాల గ్రామ శివారులోని మూసీ నది బ్రిడ్జి సమీపంలో తుడిమిడి రోడ్డు వెంట గుడిసెలు వేసుకొని నివాసముంటున్నారు. శనివారం తల్లిదండ్రులతో కలిసి పత్తి ఏరేందుకు వెళ్లిన చరణ్ సాయంత్రం పనులు ముగించుకొని గుడిసె వద్దకు వచ్చాడు. రాత్రి తన కుటుంబ సభ్యులకు టాబ్లెట్లు తెచ్చేందుకని బైక్‌పై మూసీ నది బ్రిడ్జి మీదుగా మానాయికుంటకు వెళ్తుండగా.. అప్పటికే బ్రిడ్జిపై వేసిన రైతుల ఆత్మీయ సమ్మేళన సభా వేదికను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చరణ్ తీవ్రంగా గాయపడ్డాడు. సమీపంలోని వ్యక్తులు గమనించి ఘటనా స్థలానికి వెళ్లి చూడగా చరణ్ అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వచ్చిన 108 సిబ్బంది చరణ్‌కు ప్రథమ చికిత్స అందించి వెంటనే నకిరేకల్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించగా.. అప్పటికే చరణ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బ్రిడ్జిపై వేదికను ఏర్పాటు చేసిన నిర్వాహకులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోగా.. కనీసం విద్యుత్ లైట్లు కూడా వేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు.

రైతుపై చేయి చేసుకున్న ఏఎస్ఐ

మునుగోడు: రైతుపై ఏఎస్ఐ చేయి చేసుకున్న ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు పట్టణానికి చెందిన కొమ్ము ముత్యాలుకు, మరో రైతు మధ్య గత కొన్నేళ్లుగా గెట్టు పంచాయితీ నడుస్తోంది. తాను రెవెన్యూ అధికారుల చేత సర్వే చేయించి, అధికారులు నిర్ణయించిన హద్దుల ప్రకారం భూమి సాగు చేసుకునేందుకు ప్రయత్నిస్తే ముత్యాలు సహకరించకపోవడంతో సెప్టెంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ముత్యాలు పోలీసుల వద్దకు వెళ్లి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ మాట్లాడుకుంటామని అంగీకరించాడు. కానీ పంచాయితీ పెట్టుకున్న సమయానికి ముత్యాలు వెళ్లలేదు. దీంతో సెప్టెంబర్ 30వ తేదీన ఏఎస్ఐ కోటిసింగ్ నేరుగా ముత్యాలు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పంచాయితీకి ఎందుకు రాలేదని, పోలీసులు అంటే భయం లేదా అంటూ అతడిపై చేయి చేసుకున్నాడు. దీంతో ఏఎస్ఐ కోటిసింగ్ అకారణంగా తనపై చేయి చేసుకున్నాడని జిల్లా ఎస్పీకి ఈ నెల 17న ముత్యాలు ఫిర్యాదు చేశాడు. చండూరు సీఐ విచారణ జరిపి పూర్తిస్థాయి నివేదికను ఎస్పీకి అందచేయనున్నట్లు తెలిపారు.

బతికుండగానే మరొకరికి భూమి రిజిస్ట్రేషన్

- ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధిత రైతు

కోదాడరూరల్: తాను బతికుండగానే మృతిచెందినట్లు నిర్ధారించి తన భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని కోదాడ మండలం నల్లబండగూడేనికి చెందిన చిన్న గుర్వయ్య ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు శనివారం గ్రామానికి వెళ్లి పంచానామా నిర్వహించారు. గుర్వయ్య పేరుమీద గ్రామంలోని సర్వే నంబర్ 485/అ1/1/2/1లో ఉన్న ఎకరం భూమిని రెవెన్యూ అధికారులు అతడి వారసులకు కాకుండా మరో వ్యక్తి పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. విషయం తెలుసుకున్న బాధితుడు రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై కేసు పెట్టు అని చెప్పి మూడు సంవత్సరాలుగా కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారు. గత ఫిబ్రవరిలో దీనిపై పంచనామా చేసిన అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు పంపలేదని బాధిత రైతు ఆరోపిస్తున్నాడు. ఇటీవల కలెక్టర్‌ను కలవడంతో ఆర్ఐ శ్రీధర్ గ్రామానికి వెళ్లి అతని గురించి వివరాలు సేకరించి పొలం వద్దకు వెళ్లి సర్వే చేశారు. దీనిపై నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

నకిలీ బాబాను పట్టించిన ఫోన్ పే నంబర్

- లొకేషన్ ట్రాక్ చేసి నిందితుడిని పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాల్మన్‌రాజు

ఆత్మకూరు(ఎం): మండలంలోని సింగారం గ్రామ పంచాయతీ పరిధిలోని శేర్‌బావి గ్రామానికి చెందిన వాకటి మల్లారెడ్డి ఇంట్లో శుక్రవారం నగదు అపహరించుకుపోయిన నకిలీ బాబాను ఫోన్ పే నంబర్ ఆధారంగా 24 గంటల్లోనే పోలీసులు పట్టుకున్నారు. శనివారం ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో సీఐ సాల్మన్‌రాజు విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు వాకిటి మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు నాలుగు గ్రూపులుగా విడిపోయి నకిలీ బాబా కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామంలో ఓ వ్యక్తిని విచారిస్తుంటే నాలుగు రోజుల క్రితం తన వద్దకు బాబా వేషంలో ఓ వ్యక్తి వచ్చాడని.. అతడు చెప్పినట్లు ఇంట్లో పూజ చేయించి రూ.6వేలు ఫోన్ పే చేసి, రూ.4వేలు నగదు రూపంలో ఇచ్చినట్లు చెప్పాడు. ఫోన్ పే నంబర్‌ను పోలీసులు తీసుకుని లొకేషన్ ట్రాక్ చేసి శుక్రవారం రాత్రి 12గంటల ప్రాంతంలో నల్లగొండ వద్ద నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో సహకరించిన సిబ్బందిని సీఐ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐ కృష్ణయ్య, పోలీసు సిబ్బంది అంజనేయులు, రామచంద్రయ్య, విజయ్, నరేందర్, గాయత్రి, ప్రేమలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి దుర్మరణం


వృద్ధురాలి మృతదేహం

మిర్యాలగూడ టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన శనివారం మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ సమీపంలో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు గ్రామ సమీపంలోని పెట్రోల్ బంబక్ వద్ద అద్దంకి–నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వృద్ధురాలిని శనివారం నల్లగొండ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి వయస్సు 70 సంవత్సరాలు ఉంటుందని, వంకాయ రంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి ఉందని పోలీసులు పేర్కొన్నారు. గూడూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి లావూరి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 8712670189, 8712670151 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి


రఘుప్రసాద్ (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: మండలంలోని పంతంగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమయాజుల రఘుప్రసాద్(59) గుండెపోటుతో శనివారం మృతిచెందారు. రామన్నపేట మండలం జనంపల్లి గ్రామానికి చెందిన రఘుప్రసాద్ హైదరాబాద్‌లోని కొత్తపేట డాక్టర్స్ కాలనీలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. ఆయన భార్య పద్మజ కూడా పంతంగి ఉన్నత పాఠశాలలోనే స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. శనివారం భార్యాభర్తలు ఇద్దరు కలిసి పాఠశాలలకు వచ్చేందుకు సిద్ధమవుతుండగా.. ఒక్కసారిగా రఘుప్రసాద్‌కు గుండెపోటు రావడంతో ఇంట్లోనే కుప్పకూలిపోయి మృతిచెందాడు. రఘుప్రసాద్ మృతదేహానికి పంతంగి గ్రామ మాజీ సర్పంచ్ బాతరాజు సత్యం, చీరిక సంజీవరెడ్డి, అంతటి రమేష్, పలువురు గ్రామస్తులు నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ..

భువనగిరి క్రైం: లారీలో అపస్మారస్థితిలో ఉన్న వ్యక్తిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రమేష్ ఈ నెల 24వ తేదీ భువనగిరి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట లారీలో అపస్మారకస్థితిలో ఉండగా.. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు భువనగిరి పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..


సైదా (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని మున్యానాయక్‌తండాలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్యానాయక్‌తండాకు చెందిన బానోతు సైదా(34) శనివారం గ్రామ శివారులో తన వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. బోరు మోటారు ఆన్ చేస్తుండగా స్టాటర్ బాక్స్‌లో ఉన్న విద్యుత్ వైర్లు సైదా చేతికి తగలడంతో విద్యాదాఘాతానికి గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గ్రామానికే చెందిన రైతులు ధరావతు కిషన్, బానోతు శ్రీను గమనించి సైదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

ఎలుగుబంట్ల దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

చందంపేట: నేరెడుగొమ్ము మండలం కాచరాజుపల్లికి చెందిన బద్దెల చిన అంజయ్య ఎలుగుబంట్ల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. అంజయ్య శనివారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం ఉడిమిల్లా సమీపంలోని అటవీ ప్రాంతానికి మేత కోసం పశువులను తోలుకెళ్లాడు. పశువులను మేపుతుండగా... చెట్ల పొదల్లోనుంచి రెండు ఎలుగుబంట్లు వచ్చి అతడిపై దాడి చేసి గాయపర్చాయి. వాటి బారి నుంచి తప్పించుకుని నడుచుకుంటూ గ్రామానికి వచ్చిన అంజయ్యను స్థానికులు అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ రూరల్: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. అడ్వాన్సెస్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై శనివారం ఎంజీయూలో నిర్వహించిన సమాశేలో ఆయన మాట్లాడారు. పరిశోధనల ద్వారా వచ్చే ఫలితాలు ప్రజల జీవన విధానాన్ని మార్చుతాయని అన్నారు. విద్యార్థులకు తమ భవిష్యత్తు పట్ల స్పష్టమైన అవగాహన ఉండాలని, అందుకు తగిన ప్రణాళిక అవసరమన్నారు. ప్రతి అంశంపై పరిశీలన, పరిశోధన, విశ్లేషణ చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రశాంతి, వసంత, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీలు చోరీ చేస్తున్న దొంగల రిమాండ్

వలిగొండ: ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను శనివారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం నాగారం గ్రామం వై జంక్షన్ వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు కారులో వెళ్తున్న హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీకి చెందిన చాంద్ పాషా, కళ్యాణ్‌ను అనుమానంతో ఆపారు. కారులో మూడు బ్యాటరీలతో పాటు పానలు, కట్టర్‌ను గుర్తించిన పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ట్రాక్టర్లు, లారీల్లోని బ్యాటరీలను రాత్రివేళ చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. వలిగొండ, ఆత్మకూరు(ఎం), మోత్కూరు, సంస్థాన్ నారాయణపురం మండలాల్లో 10 దొంగతనాలు చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.1.35లక్షలు, మూడు బ్యాటరీలు, కారు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

ఇండియన్ నేవీకి ఐదుగురు విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న రామయ్య డిఫెన్స్ అకాడమీ యాజమాన్యం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రంలోని రామయ్య డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందిన ఐదుగురు విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఇండియన్ నేవీ అగ్నివీర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఉద్యోగం సాధించిన విద్యార్థులు స్నిఖిత, ప్రిస్కిల్లా, శ్రీహరి, వినయ్, రిషిని శనివారం రామయ్య డిఫెన్స్ అకాడమీలో డైరెక్టర్ రామయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి సంవత్సరం డిఫెన్స్ కోర్సు తీసుకున్న విద్యార్థులు జూలై నెలలో నిర్వహించిన ఇండియన్ నేవీ అగ్నివీర్ సీనియర్ సెకండరీ రిక్రూట్ జాతీయ స్థాయి పరీక్షలో ప్రతిభ చాటి ఉద్యోగం సాధించారని అన్నారు. కార్యక్రమంలో అకాడమీ సిబ్బంది శ్రీనివాస్, అధ్యాపకులు నగేష్, బొమ్ము శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


సాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద నీరు తగ్గుముఖం పట్టింది. శనివారం రెండు గేట్లను ఐదడుగులు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.50 అడుగుల మేర నీరుంది. ఎగువ నుంచి 64,755 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా ప్రధాన విద్యుదుత్పాదన ద్వారా 29,719 క్యూసెక్కులు, స్పిల్‌వే మీదుగా 16,096 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కుడి, ఎడమ, వరద, ఏఎమ్మార్పీ కాల్వలకు 18,940 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పథకాల అమలు తీరుపై అధ్యయనం


దేవరకొండ మున్సిపల్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ప్రొబేషనరీ అధికారులు


సాగర్‌లోని బీసీ గురుకుల విద్యాలయంలో ప్రొబేషనరీ అధికారులు

- దేవరకొండ, పెండ్లిపాకల, సాగర్‌లో సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారుల బృందం పర్యటన

దేవరకొండ, కొండమల్లేపల్లి, నాగార్జునసాగర్: ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధ్యయనంలో భాగంగా శనివారం 11మంది సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారుల బృందం దేవరకొండ పట్టణంలో పర్యటించింది. పట్టణంలోని ఎస్‌టీపీ (మురుగు నీటి శుద్ధి కేంద్రం)ని పరిశీలించారు. మురుగు నీటిని శుద్ధి చేస్తున్న తీరును మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మార్సీలోని ఎంపీపీఎస్‌ను సందర్శించి అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. ఆ తర్వాత టీటీడీ కల్యాణ మండపంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై మహిళా సంఘాలకు ప్రభుత్వాల నుంచి ఆర్థిక ప్రోత్సాహం, అభివృద్ధి వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. మొదటి రోజు ప్రొబేషనరీ అధికారుల బృందం ప్రభుత్వ పథకాల అమలు తీరుపై క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. అలాగే కొండమల్లేపల్లి మండలం పెండ్లిపాకల గ్రామంలో ప్రొబేషనరీ బృందం చేస్తున్న అధ్యయనం శుక్రవారంతో ముగిసింది. గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల అమలును తెలుసుకున్నారు. అనంతరం మరో ప్రొబేషనరీ అధికారుల బృందం నాగార్జునసాగర్‌లో పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించింది. బీసీ గురుకుల విద్యాలయాన్ని సందర్శించి స్కూల్ వివరాలు, ఉత్తీర్ణత శాతం తదితర అంశాలను ప్రిన్సిపాల్ రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. నందికొండ పురపాలక సంఘం కార్యాలయంలో జరుగుతున్న పనులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట దేవరకొండ మున్సిపల్ అధికారులతో పాటు కొండమల్లేపల్లి ఎంపీడీఓ బాలరాజురెడ్డి, నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి ధన్‌సింగ్, పెద్దవూర ఎంఈఓ తరి రాములు, నందికొండ మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్, పెద్దవూర ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, బైరెడ్డి మల్లిఖార్జున్‌రెడ్డి, మహేష్, బాలాజీ తదితరులు ఉన్నారు.



సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

LEASE OR RENT
■ 1200 SFT Building Near Hi-Tech Bus Stand towords. Hyderabad Road, High Way Face, Suryapet Town. Corporate Showrooms, Highway Food Court, etc. Cont: 9948536066, 9640919999 [YA-6733]

HOUSE FOR SALE
■ ఉత్తమ డ్యూప్లెక్స్ లగ్జరీ విల్లాలు. నివసించుటకు సిద్ధంగా ఉంది! మిర్యాలగూడలో 2, 3 & 4BHK విల్లాలు, D-మార్ట్ పక్కన ఆధునిక సౌకర్యాలను ఆస్వాదించండి. క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్. సంప్ర: Ph: 9866669768 [HA-823]

Wanted
■ నల్లగొండలో వంట చేయుటకు అనుభవం కలిగిన వంట మనిషి భార్యాభర్తలు కావలెను. సంప్రదించండి. సెల్: 6300896300 [Y-1145754]
■ పని వారు కావలెను Hyd, బెంగుళూరులో ఉండి ఇంటి, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకి స్త్రీలు కావలెను. 9391912949/ 040 40123376 [SCA24000489]
■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ వసతి ఫుడ్ , జీ: 20K, Ph: 8977639662, 8977639663 [SCA24000512]
■ Wanted Female Computer Operator to work at Bank Valuer Office, Suryapeta. Send to Resume Whatsapp - 95057 99599 [V- 823903]
■ షిరిడీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు, వార్డ్ బాయ్స్, కాంపౌండర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-14726]
■ WANTED ASST. Prof of CSE, ECE, EEE, MBA, MATHS, ENGLISH, MECHANICAL Experienced AO Scholarship Incharge lady hostel wareden, supervisor, cooks, watchman MLG. 9848207323, 9866349247 [Y-798483]
■ ప్రముఖ VSR Services Office నందు పనిచేయుటకు లేడీ టెలీకాలర్స్, లేడీ రిసెప్షనిస్ట్ -10, లేడీ బ్రాంచ్ మేనేజర్స్ - 10, లేడీ హెల్పర్స్ అర్జెంట్‌గా కావలెను. ఫీజు లేదు. రూం + భోజనం ఫ్రీ, జీతం : 12,000/- నుండి 20,000/- వరకు, వయసు : 20-30 సం॥. Qlf. : 10th - డిగ్రీ. ఫోన్ : 99858 99988 [V- 823877]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.